క్లుప్తంగా

అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం



విజయవాడకల్చరల్: బ్రాహ్మణ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకట దశరథ రమేష్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి బ్రాహ్మణ సేవా సంఘానికి నూతన కార్యవర్గాన్ని మంగళవారం సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా డాక్టర్ బీవీ గురునాథ శర్మ, ఉపాధ్యక్షులుగా కాశీభట్ల సూర్యనారాయణ శాస్త్రి, కావూరి సత్యనారాయణ మూర్తి, యడ్లపాటి శేష సాయి, కె.శ్రీనివాసరావు, కామర్స్ రాజేష్, కొల్లిపర సతీష్, మేడికొండూరి ప్రసాదరావు, తాళ్లూరి రాజీవ్ శర్మ కార్యదర్శులుగా కామర్స్ మాధవి, యడ్లపాటి శిరీషా రాణి, అనుముల విజయలక్ష్మి, లక్ష్మీ కల్యాణిలను ఎన్నుకున్నామన్నారు.

తెలుగు సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలమేలు మంగ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో మంగళవారం శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని తెలుగు సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఏపీ ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. తెలుగు సంవత్సర క్యాలెండర్ ముద్రించిన శ్రీ గోపరాజు వెంకటేశ్వర్లు స్మారక సమితి సభ్యులను అభినందించారు. తొలుత ఆలయంలో పూజలు చేశారు. అనంతరం బ్రహ్మశ్రీ క్రోవి పార్థసారథి పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అద్దంకి సత్యనారాయణ ప్రసాద్, ఎం.గోపీచంద్, కుప్పా శ్రీనివాస్, ఉప్పులూరు శేష ప్రసాద్ శర్మ, మార్తి చంద్రమౌళి, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు రంజాన్ తోఫా పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ పేద ప్రజలకు సహాయం చేసేందుకు ఎల్లప్పుడూ ముందుకు రావాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఆ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎండీ ఇస్మాయేల్ ఆధ్వర్యంలో 60వ డివిజన్ వాంబేకాలనీలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు మంగళవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో నిరుపేద ప్రజలకు సాయం చేస్తే ఆ అల్లాహ్ 70 రెట్లు అధిక పుణ్యాన్ని ప్రసాదిస్తాడని చెప్పారు. మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో ముస్లింలు ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ నాయకులు ఎండీ రఫీ, నాగూర్, షేక్ షేర్ అలీ, షేక్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు సెక్షన్, అయోధ్యనగర్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 11 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేదారేశ్వర పేట 1 లైన్ నుంచి ఏడవ లైన్ వరకు, లోటస్ సెక్టార్ 1 నుంచి సెక్టార్ 5 వరకు, రామలింగ శ్వరపేట జీరో లైన్ నుంచి ఏడో లైన్ వరకు, శాంతినగర్, అయోధ్యనగర్, బసవతారక నగర్, బుడమేరు కట్ట ఏరియా, సూరిబాబు కాలనీ, డొంక రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా ఉగాది వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



బాబా మందిరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, కార్పొరేటర్లు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు, భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గ వ్యాప్తంగా క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకుని, పంచాంగ శ్రవణాలను శ్రద్ధగా తిలకించారు. శ్రీ క్రోధినామ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని సాయినాథుని ఆశీస్సులు ప్రతీ ఒక్కరికీ అందాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మధురానగర్ శ్రీ భగవాన్ షిర్డీసాయిబాబా మందిరంలో మంగళవారం ఉగాది వేడుకల్లో ఆయన కార్పొరేటర్లు పెనుమత్స శిరీష, కొంగితల లక్ష్మీపతిలతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబావారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అన్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం శ్రీ మురళీకృష్ణ కోలాట బృందం, మందిర కమిటీ ఆధ్వర్యాన వెలంపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మందిర కమిటీ ప్రధాన కార్యదర్శి పీవీఎల్ఎన్ రాజు, ఎం.బాలవర్ధనరావు, నాయకులు పెనుమత్స సత్యం, డాక్టర్ పిల్లి జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా..

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో మంగళవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన వసంత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి పసుపు, కుంకుమతో అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారికి గాజులతో పూజలు చేసి అలంకారం చేశారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్ పెనుమత్స శిరీష, మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. మధురానగర్ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారికి విశేషంగా కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.



సర్టిఫికెట్లు అందుకున్న విజేతలతో గ్రంథాలయాధికారి రమాదేవి



దేవీనగర్‌లో పంచాంగ శ్రవణం చేస్తున్న మాచిరాజు వేణుగోపాల్



అవధానులను సత్కరిస్తున్న అర్చకులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామి వారి దేవాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం ఉగాది కలిసి రావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందుకున్నారు. అధ్యాత్మిక ప్రవచకులు దిట్టకవి రామకృష్ణాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు. దేవీనగర్ శ్రీ కోదండ రామాలయంలో బెల్లంకొండ వెంకటేశ్వర్లు దంపతుల ఆధ్వర్యాన ఉగాది వేడుకల్లో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు డాక్టర్ మాచిరాజు వేణుగోపాల్ పంచాంగ శ్రవణం చేశారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బీహెచ్ ఎస్వీ జానారెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.వీరరాజు, గంగిశెట్టి సాంబశివరావు పర్యవేక్షించారు.

ఠాగూర్ గ్రంథాలయంలో ఉగాది సంబరాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. జ్యోతి మహిళా మండలి - ఠాగూర్ గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో మహిళలు రంగవల్లులు వేసి వాటిని అందంగా అలంకరించారు. మహిళలు తమ సృజనను చూపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కే రమాదేవి మాట్లాడుతూ మహిళలు ఇంటి పనుల్లో తీరిక లేకుండా ఉంటారని, వారిలో దాగిన సృజనను వెలికితీసేందుకు పోటీలు నిర్వహించామన్నారు. ఉత్సాహంగా ఆట, పాటల్లో రాణించారన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో జ్యోతి మహిళా మండలి అధ్యక్షురాలు గంధం ఝాన్సీ, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో పంచాంగ శ్రవణం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీకాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ క్రోధి నామ నూతన సంవత్సర ఉగాది సందర్భంగా దేవస్థానం నందు రాళ్లపల్లి వేంకటేశ్వర శర్మ పంచాంగ శ్రవణం చేశారు. దేవస్థానం తరుపున పండితులకు, భక్తులకు ఉచితంగా పంచాంగాలు పంపిణీ చేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఋగ్వేద పండితులు బ్రహ్మశ్రీ విరూపాక్షం శ్యావాశ్వ మహర్షి అవధానులను నూతన వస్త్రాలు, పండ్లు, రూ.10,116లు పారితోషికం అందజేశారు. దేవస్థానం తరపున పండిత సత్కారం నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నూతక్కి వెంకట సాంబశివరావు, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

నాగసాయిబాబా మందిరంలో ఉగాది వేడుకలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలు లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం కార్యక్రమం జరిగింది. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో పండితులకు, భక్తులకు ఉచిత పంచాంగాలు పంపిణీ చేశారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యక్రమానికి హాజరై బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మందిర ప్రాంగణంలోని నాగమానసాదేవి అమ్మవారికి పూలతో అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళా భక్తులు బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మహిళా భక్తులు సుధాస్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విష్ణును సత్కరించారు. మందిరంలో నిత్యం బాబా కీర్తనలు ఆలపించే భక్త బృందాన్ని సుధాస్వామి సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు.

ఈశ్వరమ్మ తల్లి ఆలయంలో

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గ్రామదేవత ఈశ్వరమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. వర్షాలు సకాలంలో కురవాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ 108 కడవలతో గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారికి నీళ్లు పోశారు.

స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష మహిళలతో కలిసి అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి దేవాలయం తరుపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి మేళతాళాలు డప్పువాయిద్యాలతో ఊరేగింపు జరిగింది. కార్యక్రమంలో నాయకులు పెనుమత్స సత్యం, పి.పట్టాభిరామరాజు ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ సుబ్బరాజు, దాట్ల శివరామ రాజు, సామంతపూడి చిన్నా తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో..



శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారు



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం



ఈశ్వరమ్మ అమ్మవారు



దాసాంజనేయ ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న దిట్టకవి రామకృష్ణాచార్యులు

బాబా మందిరంలో పంచాంగ శ్రవణం



పంచాంగ శ్రవణం చేస్తున్న పుచ్చా శ్రీనివాసరావు, చిత్రంలో పూనూరు గౌతంరెడ్డి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో మంగళవారం మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అధ్యక్షతన పంచాంగ శ్రవణం జరిగింది. ప్రముఖ జ్యోతిష్య పండితులు పుచ్చా శ్రీనివాసరావు పంచాంగ శ్రవణం చేశారు. శ్రీక్రోధి నామ సంవత్సరంలో విశిష్టతలు విశేషాలను వివరించారు.

డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. బాబావారి ఆశీస్సులు ప్రతీ ఒక్కరికీ లభించాలన్నారు. అనంతరం అభినవ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. తొలుత బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సర్వశుభదాయని క్రోధి నామ ఉగాది



శ్రీవిద్యాపాదుకాంత దీక్ష గ్రంథావిష్కరణ సభలో ఎమ్మెల్యే విష్ణు, పార్థసారథి, హరికుమార్

విజయవాడకల్చరల్: సర్వశుభదాయని క్రోధి నామ తెలుగు ఉగాది అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శ్రీ గాయత్రీ సొసైటీ ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులోని గాయత్రి కన్వెన్షన్‌లో మంగళవారం నూతన తెలుగు సంవత్సర ఉగాది వేడుకలు, లలితా, విష్ణు సహస్రనామ పారాయణం, పంచాగం శ్రవణం, శ్రీవిద్యా పాదుకాంత పూర్ణదీక్ష గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. తెలుగు వారి ముఖ్యమైన పండుగ ఉగాది అని ఇదే రోజున బ్రహ్మ సృష్టిని ప్రారంభించాడని పురాణాలు చెబుతున్నాయన్నారు. ప్రజలు ప్రజా సంక్షేమ కార్యక్రమానికి పట్టం కట్టాల్సిన అవసరముందని చెప్పారు. డాక్టర్ క్రోవి ప్రార్థసారథి రచించిన శ్రీ విద్యాపాదుకాంత గ్రంథాన్ని విష్ణు ఆవిష్కరించారు. నూతన తెలుగు సంవత్సరం సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణ మండలి సభ్యులచే విష్ణు సహస్ర, లలితా సహస్ర హనుమాన్ చాలిసాను పారాయణం చేశారు. పంచాంగ కర్త కప్పగంతు సుబ్బరామ సోమయాజి అన్ని రాశుల వారి పంచాంగ ఫలాలను వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణీమూర్తి, చెట్లపల్లి మారుతీ ప్రసన్న, యాబలూరి లోకనాథ శర్మ, గాయత్రి సొసైటీ గౌరవ అధ్యక్షుడు పోత ప్రగడ మణికుమార్, అధ్యక్షుడు గంటి ఈశ్వర్, జనరల్ సెక్రటరీ చల్లా హరికుమార్ పాల్గొన్నారు. పంచాంగ శ్రవణం చేసిన కప్పగంతు సుబ్బరామ సోమయాజిని ఎమ్మెల్యే విష్ణు ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు నూతన సంవత్సర పంచాంగాలను పంపిణీ చేశారు.

దేవాలయాల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి, విష్ణు, వేదికపై కమలానంద భారతీ స్వామి

విజయవాడకల్చరల్: దేవాలయాల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి అనుగ్రహ భాషణ చేశారు. సీతారామా కల్యాణ మండపంలో మంగళవారం క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు పంచాగ శ్రవణం, వేద సభ, స్వామి అనుగ్రహ భాషణ మండపం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామిజీ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో వందలాది దేవాలయాలు జీర్ణ స్థితిలో ఉన్నాయని, వాటికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరముందన్నారు. భారతీయ సంస్కృతికి మూలం వేదాలని వాటిని కాపాడుకోవాలన్నారు. భువనేశ్వరీ పీఠం సనాతన హిందూ ధర్మం, దేవాలయ పరిరక్షణకు కృషి చేస్తోందని తెలిపారు. అనేక ప్రాంతాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించి వారిని కార్యోన్ముఖులను చేస్తున్నామన్నారు. వేదపండితులు వేద సభను నిర్వహించారు. కల్యాణ మండపం నిర్వాహకులు దమ్మాలపాటి చంద్రశేఖర్ వేద పండితులను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తి స్వామిజీ ఆశీస్సులు అందుకున్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ స్వామిజీ సూచనలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. మల్లాది విష్ణు ఉగాది నియోజకవర్గ ప్రజలకు శుభాలు కలగాలని ఆకాంక్షించారు. స్వామిజీని ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు ఘనంగా సత్కరించారు.

ఉగాది పురస్కారాలు అందజేత

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కృష్ణలంకలోని వాసవీ కల్యాణ మండపంలో వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. దంత వైద్యుడు రామస్వామి, నేత్ర వైద్యుడు రామకృష్ణ, ఆడిటర్లు పెనుగొండ సుబ్బరాయుడు, గద్దం సత్యనారాయణ, ఆయుర్వేద వైద్యుడు రవి, గోవింద మాల ఉపాసకుడు వెంకట గాంధీబాబు తదితరులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. అనంతరం బ్రహ్మశ్రీ శ్రీరామసాయి పంచాంగ శ్రవణం నిర్వహించారు. వాసవీ సేవా సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మానేపల్లి మాణిక్యాలరావు, గొంట్ల రామ్మోహనరావు, కోశాధికారి చందలూరి వెంకట సుబ్బారావు, మట్టా సుబ్బారావు, తడికమళ్ల సురేష్, సాంబశివరావు పాల్గొన్నారు.

గాజుల అలంకారంలో అమ్మ వార్ల దర్శనం



కృష్ణలంక(విజయవాడతూర్పు): క్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో శ్రీ మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లు గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు 50 వేల గాజులతో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వసంత నవరాత్రులు ప్రారంభ సందర్భంగా లక్ష్మీగణపతి, మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం, పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. అనంతరం 100 మందితో లలిత సహస్ర పారాయణం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో పుచ్చా సూర్యప్రకాశ్ శాస్త్రిచే ఉగాది పంచాంగ శ్రవణం జరిగింది. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు సీహెచ్ విజయకిరణ్, ఆలయ సూపరింటెండెంట్ ఎ.మధుసూదనరావు, ఆలయ కమిటీ సభ్యులు జి.సత్యం, మల్లేశ్వరరావు, రాజా, వంశీ, విశ్వేశ్వరయ్య, జగన్ తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా ఎమ్మెల్సీ రుహుల్లా జన్మదిన వేడుకలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా జన్మదిన వేడుకలు సింగ్‌నగర్, నందమూరినగర్, న్యూఆర్ఆర్‌పేట, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ సెంట్రల్ కార్యాలయంలో, సింగ్‌నగర్ 59వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్యాలయాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఆయన కేక్ కట్ చేసి నాయకులు, అభిమానులకు తినిపించారు. రుహుల్లా మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీమ్, ఎండీ హఫీజుల్లా, నిరంజన్, షేక్ అమిత్, గెల్లిపోగు రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శిరీష, సత్యం, నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపించాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష కోరారు. 31వ డివిజన్ పసుపుతోటలో మంగళవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు గడప వద్దకే ప్రభుత్వ పథకాలు అందించామని గుర్తు చేశారు.

అభివృద్ధి, సంక్షేమం నిరంతరాయంగా కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించారని, కోవిడ్ సమయంలో సైతం ప్రజలకు అండగా నిలిచారని అటువంటి జగనన్నకు అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలుస్తామని ప్రజలు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, నాయకులు కె.వెంకటేశ్వరరావు, విజయ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

భూ పోరాటాలకు స్ఫూర్తి చంద్ర రాజేశ్వరరావు



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తన సొంత భూమిని పేదలకు పంచడమే కాకుండా దున్నే వారిదే భూమి అనే నినాదంతో ముందుకు సాగిన నాయకుడు కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు అని అభ్యుదయ రచయిత సంఘం(అరసం) జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్ అన్నారు. చంద్ర రాజేశ్వరరావు 30వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ప్రజాశక్తినగర్‌లోని చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయం ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి సుదీర్ఘ కాలం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ కార్మిక, రైతాంగ సమస్యల మీద పోరాటాలు సాగించారని చెప్పారు. అరసం సభ్యుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం నాయకులు, యువత ముందుకు సాగాలన్నారు.